

వొడితెల సతీశ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా గులాబీమయమైన హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా

# హుస్నాబాద్ గులాబీమయం

- అట్టహాసంగా నామినేషన్ వేసిన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హాజరైన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

హుస్నాబాద్, నవంబర్ 8 : హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఉదయం తన స్వగ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం హుస్నాబాద్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో సతీమణి డాక్టర్ షమిత, తల్లి సరోజినీదేవి, కుమారుడు ఇంద్రనీల్ బాబు, కుటుంబ సభ్యులు, బంధువులు, ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చెంతన పెట్టిన నామినేషన్ పత్రాలను పూజల అనంతరం పూజారులు ఎమ్మెల్యే చేతికి అందించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో తన తండ్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏడు మండలాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు తరలివచ్చారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్, మల్లె చెట్టు చౌరస్తా, మెయిన్‌రోడ్డు ద్వారా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, యూత్ నాయకుడు వొడితెల ఇంద్రనీల్‌బాబు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. డప్పుల చప్పుళ్లు, మహిళల నృత్యాలు, జై తెలంగాణ, జై కేసీఆర్, జై సతీశన్న నినాదాలతో హుస్నాబాద్ పట్టణ మార్మోగింది. మధ్యాహ్నం 12.30గంటలకు ఐవోసీ భవనంలోని ఆర్వో కార్యాలయంలో ఎమ్మెల్యే తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తన తండ్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

### తండ్రి విజయం కోసం కూతురు ప్రచారం

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కూతురు డాక్టర్ పూజిత నామినేషన్ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తండ్రి నామినేషన్ కార్యక్రమానికి హాజరై ర్యాలీలో పాల్గొని యువతులు, మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. మహిళలతో కలిసి నృత్యం చేశారు. సతీశ్‌కుమార్ తల్లి సరోజినీదేవి సైతం మహిళలతో కలిసి నృత్యం చేశారు. కుమారుడు ఇంద్రనీల్‌బాబు కూడా యువతతో కలిసి నడుస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.

# మూడోసారి విజయం సాధిస్తా

- హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదం నాకే ఉంది
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంలో సతీశ్‌కుమార్ కృషి అభినందనీయం
- మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి
- హుస్నాబాద్‌లో నామినేషన్ దాఖలు



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 8: హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి విజయం సాధిస్తానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి బుధవారం ఆయన నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో 2014, 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు గెలిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహకారంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చి రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంపై సంపూర్ణ అవగాహన ఉన్న సతీశ్‌కుమార్‌ను ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. గౌరవెల్లి ద్వారా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు సాగునీరందగా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్‌మానేరు ద్వారా, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు దేవాదుల ద్వారా సాగునీరందుతుందని చెప్పారు. ఎల్కతుర్తి-సిద్దిపేట-మెదక్-నాందేడ్ హైవే నిర్మాణంతో హుస్నాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. సతీశ్‌కుమార్‌కు హ్యాటిక్ విజయం అందించాలని ఓటర్లను కోరారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంలో సతీశ్‌కుమార్ కృషి అభినందనీయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుర్చీల కొట్లాట తప్ప అభివృద్ధి ఉండదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అడ్రస్ గల్లంతయిందన్నారు.



ఎల్లమ్మ దేవాలయంలో పూజల అనంతరం నామినేషన్‌ను సతీశ్‌కుమార్ అందజేస్తున్న పూజారులు



ప్రార్థన చేస్తున్న ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు

## సతీశ్ గెలుపు కోసం ముస్లింల ప్రార్థనలు

హుస్నాబాద్, నవంబర్ 8 : ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బుధవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. నామినేషన్ వేస్తున్న శుభ సందర్భంగా ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేసి సతీశ్‌కుమార్‌ను అల్లా ఆశీర్వదించేలా వేడుకున్నారు. అంతకుముందు ముస్లిం మైనార్టీల అభివృద్ధి కరపత్రాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, ముస్లిం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జామా మసీదు అధ్యక్షుడు ఎండీ బాషుమియా, ఆలంగీర్ మసీద్ అధ్యక్షుడు ఎండీ అన్వర్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అయూబ్, ముస్లిం పెద్దలు ఎండీ మన్ననసుదర్ ఖాజీ, ఎమ్మెస్ అలీ, ఎండీ నయీమ్, రుహుల్ అమీన్, మహ్మద్ బారీ, యూసూఫ్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తి: పార్టీ నేతలతో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

## హుస్నాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఎల్కతుర్తి, నవంబర్ 8: హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ బుధవారం నామినేషన్ వేసిన సందర్భంగా మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు హుస్నాబాద్‌కు భారీగా తరలివెళ్లారు. ఎల్కతుర్తి నుంచి జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అబద్ధాలు చెప్పినా, అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. మరోమారు బీఆర్ఎస్‌కు అధికారం కట్టబెట్టడంతోపాటు హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీపీ మేకల స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, రైల్వే బోర్డు మెంబర్ ఎల్తూరి స్వామి, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ పోరెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెడ మహేందర్, సొసైటీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బూర్గుల రామారావు, కడారి రాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి హరీశ్‌రావు

## బీఆర్ఎస్‌లో చేరికల జోష్

సిద్దిపేట, నవంబర్ 8 : ఐదేండ్లపాటు సిద్దిపేట అభివృద్ధిపై మీ ముందు పరీక్ష రాసిన.. ఆ మార్కులు వేసే నిర్ణయం మీపైనే ఉందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని తన నివాసంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణారెడ్డి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్ బండి సుగుణ, జిల్లా నాయకురాళ్లు కనకమ్మ, ఇంద్ర, యాదమ్మ చేరారు.